క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజరు కార్యాలయంలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు డీఎం రమణయ్య బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు కార్యక్రమంలో ఆర్టీసీ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి



ధ్వజారెడ్డి దంపతులను అభినందిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సత్కరించారు. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రతిష్టత కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలరాయి గుట్టపై పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరుడు

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డి పల్లె పంచాయతీ తిరుమలరాయి గుట్టపై వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూలవిరాట్‌కు భక్తులు ప్రత్యేక పూజలు చేయించారు. ప్రతి పౌర్ణమికి పెద్ద సంఖ్య భక్తులు ఇక్కడి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారని ఆలయ అర్చకులు తెలియజేశారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చింతచెట్టుకు ఆకతాయిల నిప్పు

పెనగలూరు : మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామం దళితవాడ వద్ద ఉన్న పాత చింత చెట్టుకు ఆకతాయిలు మంగళవారం రాత్రి నిప్పుపెట్టారు. అర్ధరాత్రి సమయంలో నిప్పు పెట్టడంతో ఓ కొమ్మ విరిగి విద్యుత్ లైన్‌పై పడింది. దీంతో గ్రామస్తులు భయభ్రాంతాలకు గురయ్యారు. వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలియజేయడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో గ్రామస్తులు విద్యుత్ సిబ్బందిని అభినందించారు.

విద్యార్థినికి అభినందన

రాజంపేట : ఒంగోలు క్విస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి స్టూడెంట్స్ మీట్‌లో అన్నమాచార్య ఫార్మసీ విద్యార్థి సుగుణ రాణించింది. వివిధ క్రీడల్లో జరిగిన పోటీల్లో సుగుణ లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో సత్తా చాటింది. విద్యార్థినికి నిర్వాహకులు నగదు బహుమతితో పాటు మెడల్, సర్టిఫికెట్టును అందజేశారు. బుధవారం అన్నమాచార్య ఫార్మసీ కాలేజీలో విద్యార్థినిని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అభినందించారు.

క్రమశిక్షణతో అత్యున్నతస్థాయికి ఎదగాలి

సిద్దవటం : విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఒంటిమిట్ట సీఐ టి.బాబు తెలిపారు. సిద్దవటం మండలం టక్కోలు గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ – 100, రహదారి భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు.

బీసీల మహాసభను విజయవంతం చేయాలి

రామాపురం : ఈనెల 16వ తేదీన రాయచోటి పట్టణంలో అజయ్ ఫంక్షన్ హాల్‌లో జరిగే జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహాసభకు బీసీ సంఘం సభ్యులందరూ హాజరుకావాలని జిల్లా బీసీ అధ్యక్షురాలు పద్మయాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలో బుధవారం బీసీల సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు అన్ని విధాల న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చూడాలన్నారు. బీసీలకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్‌యాదవ్, రమేష్, కొండయ్య, రమణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ వేడుక

సిద్దవటం : మండలంలోని భాకరపేట గ్రామం శివునిపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ కాశిరెడ్డినాయన స్వామి 23వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా బుధవారం అశ్వర్థనారాయణ స్వామి (వేపచెట్టు, రావిచెట్టులకు)కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితుడు రామకిషోర్ వేద మంత్రాలతో స్వామి వారికి గణపతిపూజ, పుణ్యహావచనం వంటి పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వరి సాగులో సూక్ష్మపోషకాలు ముఖ్యమే

- లోపాలు గుర్తిస్తే రైతులు నివారణ చర్యలు తీసుకోవాలి
- జాగ్రత్తలు పాటిస్తే దిగుబడి పొందవచ్చంటున్న అధికారులు

సిద్దవటం : ఈ రబీ సీజన్‌లో రైతులు బోరుబావుల కింద, ఇతర నీటి వనరుల కింద వరి పంటను సాగు చేస్తున్నారు. పంట సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించక రైతుల తీవ్రంగా నష్టపోతున్నారు. పంటసాగు ఒక ఎత్తయితే ఆ పంటకు కావలసిన ఎరువులు అందించే విధానం చాలా ముఖ్యం. పంట పెరుగుదలకు ప్రధాన పోషకాలతోపాటు సూక్ష్మ పోషకాలు చాలా అవసరం. ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ అందుబాటులో ఉన్నా, సూక్ష్మ పోషకాల లోపాలు ఉంటే పంటల దిగుబడులు తగ్గుతాయని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రి నాగరాజ రైతులకు చెపుతున్నారు. జింకు, ఇనుము, బోరాన్, రాగి, మాంగనీస్ మాలిబ్డినీయం, క్లోరిన్ వంటి పోషకాలను సూక్ష్మ పోషకాలు అంటారు. రైతులు ప్రధాన పోషకాలు వాడటానికి అలవాటు పడుతున్నారు. నేలలో ఏ ఒక్క పోషక పదార్థ లోపం ఉన్నా ప్రధాన పోషకాలు సరిగా పనిచేయవు, దిగుబడిని ఇవ్వవు, దీనివల్ల నేలలో పోషక లోపాలు ఉంటే వాటిని సాధ్యమైనంత వరకు నేలలోనే వాటికి సంబంధించిన ఎరువులను వేసుకుంటే పంటలపై లోపాలు రాకుండా నివారించుకోవచ్చు.



సూక్ష్మపోషక లోపంతో ఉన్న వరి పైరు

ముఖ్యంగా వరి సాగులో సూక్ష్మపోషకాల అవశ్యకత ఎంతో అవసరం.

జింక్

మొక్కల పెరుగుదలకు అవసరమైన హార్మోన్‌లు, అమైనో ఆమ్లాలు, మాంసకృతులు తయారు చేసుకోవడానికి, నత్రజని, భాస్వరం వంటి పోషకాల సమర్థ వినియోగానికి జంక్ చాలా అవసరం ఉంటుంది. ఈ లోపం కారణంగా వరిలో మొక్క పైనుంచి 3 లేదా 4 ఆకుల్లో మధ్య ఈనె పాలిపోతుంది. నాటిన 2 నుంచి 4 వారాల్లో ముదురాకు చివరల్లో మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేదా ఇటుకరంగు మచ్చలు కనిపిస్తాయి. ఆకులు గిడసబారి దుబ్బులు (గంటలుగా) తయారుకావు. మురుగునీరు పోని భూముల్లో ఇది ఎక్కువగా కనిసిస్తుంది. వరిలో ఎక్కువ మోతాదులో నత్రజని, భాస్వరం, ఎరువుల వాడకం వలన జింక్ లోపం వస్తుంది.

నివారణ చర్యలు

ఒకేసారి వరి పండించే భూముల్లో అందునా రెండు పంటలు పండించే భూముల్లో ప్రతి సీజన్‌లో ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను వేయాలి. జింకు లోపం సవరించడానికి ఎకరాకు 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. భాస్వరం ఎరువులతో జింక్ సల్ఫేట్ కలిపి వేయవద్దు. ఎరువు వేసేటప్పుడు కనీసం 3 రోజుల వ్యవధి ఉండాలి. జింక్ సల్ఫేట్ వేయలేని పరిస్థితుల్లో పైరుపై జింక్ లోపం కనిపించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి 5 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి.

ఇనుము

ఆకులో పత్ర హరితం తయారు కావడానికి ఇనుము ఆధారం. ఇది పిండి పదార్థాల తయారీకి ఉపయోగపడుతుంది. మెట్ట ప్రాంతాల్లోని వరి నారుమళ్లలో ఇనుము లోపం కనిపిస్తుంది. ఇనుపధాతు లోపం కారణంగా లేత చిగురాకులు తెల్లగా మారుతాయి. లోపం ఎక్కువగా ఉన్నప్పుడు ఇటుక రంగు మచ్చలు ఏర్పడి, ఆకులు ఎండిపోతాయి.

నివారణకు

ఒకలీటరు నీటికి 20 గ్రాముల అన్నభేది, 2 గ్రాముల నిమ్మఉప్పు కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ ద్రావణాన్ని 5 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి. మార్కెట్‌లో అన్నీ సూక్ష్మ పోషకాల మిశ్రమం ఆగ్రో మిన్‌మాక్స్ రూపంలో ఫార్ములా–4 రూపంలోనూ దొరుకుతాయి.

రైతుల సమస్యలను పరిష్కరించండి

సుండుపల్లె : తప్పులకు ఆస్కారం లేకుండా రీసర్వే పనులు చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని ముడుంపాడు పంచాయతీలోని కందనవాండ్లపల్లెలో జరుగుతున్న రీసర్వే పనులను ఆమె తహసీల్దార్ దైవాదీనంతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పొలాల వద్ద రైతులతో సర్వే పనులపై ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరబల్లి : మండలంలోని రెవెన్యూ సమస్యలపై బుధవారం రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి ఆరా తీశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు.



సుండుపల్లె: రీసర్వే పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నైదియా దేవి

ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూములు ఫ్రీ హోల్డ్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను ఎన్ని పరిష్కరించారు అనే విషయంపై ఆరాతీశారు. భూముల రీసర్వే గురించి ఆమె సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

సచివాలయాలు ఖాళీ!

- విధులు పట్ల సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం
- షోకాజ్ నోటీసులు జారీ చేసిన ఎంపీడీఓ

గాలివీడు : ప్రజా సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురవుతోంది. దీంతో గ్రామీణులు పొందాల్సిన సేవలను సకాలంలో అందుకోలేక సతమతమవుతున్నారు. మండలంలోని పంచాయతీల్లో పని చేస్తున్న సచివాలయాల సిబ్బంది మండల అధికారుల అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా గైర్హాజరు అవుతున్నారు. తరువాత రోజు వచ్చి రాకున్న రోజుల్లోనూ కార్యాలయాలకు వచ్చినట్టు అటెండెన్స్ వేసుకుంటున్నారు. బాధ్యతయుతంగా వ్యవహరించాల్సిన అధికారులే ఇలా కార్యాలయాలకు గైర్హాజరు అవ్వడమే కాక కార్యాలయాలను మూత వేస్తుండటంతో ప్రజా సేవలు అందక ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడటమే కాక ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టాల్సిన సర్వేలలోనూ జాప్యం జరుగుతుంది. సచివాలయాల్లో సిబ్బంది హాజరు అయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

షోకాజ్ నోటీసులు జారీ

విధులకు డుమ్మా కొట్టిన ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. బుధవారం మండలంలోని సచివాలయాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. చాలాచోట్ల సచివాలయం సిబ్బంది ముందస్తు అనుమతులు లేకుండా



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

గైర్హాజరవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయంటూ ఎంపీడీఓ హెచ్చరించారు.

గైర్హాజరైన సిబ్బంది వివరాలు

మండలంలో వివిధ సచివాలయాలకు సంబంధించి గైర్హాజరు అయిన వారు ఎస్.రసూల్ బాషా – పంచాయతీ కార్యదర్శి – పూలుకుంట (ఫిబ్రవరి 3, 2025 నుంచి గైర్హాజరుతోపాటు సచివాలయం మూసివేత), జె.మదన్‌మోహన్ – పంచాయతీ కార్యదర్శి గుండ్లచెరువు (డిసెంబర్ 28, 2024 నుంచి అనుమతి లేకుండా గైర్హాజరు), ఎ.భార్గవి – వీఆర్‌ఓ, పూలుకుంట – అరవీడు (ఫిబ్రవరి 7, 2025 నుంచి అనుమతి లేకుండా గైర్హాజరు, సర్వేల పట్ల నిర్లక్ష్యం), పి.జ్యోతి – జీఎంఎస్‌కే, పూలుకుంట (నవంబర్ 30, 2024 నుంచి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు), కె.లావణ్య – ఇంజనీరింగ్ అసిస్టెంట్, పూలుకుంట (డిసెంబర్ 20, 2024 నుంచి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు), కె.వి సుధాకర్ – వీఆర్‌ఓ, గరుగుపల్లె, టీఎస్ యశోదమ్మ – వీఆర్‌ఓ, గుండ్లచెరువు వీరు మండల అధికారుల అనుమతులు లేకుండా గైర్హాజరు అవ్వడంపై రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆయన నోటీసుల్లో పేర్కొన్నారు.

గ్యాస్ బిల్లుల అవకతవకలపై విచారణ చేయాలి

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లాలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలల్లో చోటుచేసుకున్న గ్యాస్ బిల్లుల అవకతవకలపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి లవకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డైట్ బిల్లులకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.1400 చొప్పున చెల్లిస్తూ ఉంటే గురుకుల పాఠశాలల యాజమాన్యం బయట మార్కెట్‌లో ఉన్న ధరల కంటే అధికంగా ఒక సిలిండర్‌కు రూ. 218లు రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీకి చెల్లించి గ్యాస్‌ను కొనుగోలు చేయడం జరుగుతోందంటూ ఆరోపించారు. గ్యాస్‌కు అధిక ధరలు చెల్లిస్తున్నట్లు చెబుతూ సదరు మొత్తాన్ని విద్యార్థులకు చెల్లించే సొమ్ము నుంచి నొక్కేస్తుండడం దారుణమన్నారు. గ్యాస్ బిల్లుల చెల్లింపులో అక్రమాలకు పాల్పడుతూ ఖజానాకు తీరని నష్టాన్ని కలిగిస్తున్న అధికారులను గుర్తించి వెంటనే వారిని విధుల నుంచి తొలగించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు అరవింద్, వెంకటరమణ, గణేష్‌నాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల గడువు పొడిగింపు

చిన్నమండెం/గాలివీడు : బీసీ, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ, కాపు కులాలకు చెందిన లబ్ధిదారులకు సంబంధించిన బీసీ కార్పొరేషన్ రుణాల గడువును ఈ నెల 15వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించినట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు శేఖర్‌నాయక్, జవహర్‌బాబు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సబ్సిడీతో కూడిన రుణాలకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు 12వ తేదీ వరకు ఉన్న గడువును ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించిందన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగంతో ఆరోగ్యం

చిన్నమండెం : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు తెలిపారు. బుధవారం మండంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ కూరగాయలు, ఆకుకూరలు తదితర ఉత్పత్తులు నాణ్యతగా మంచి ప్యాకింగ్‌తో అందిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రజలు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడాలని సూచించారు. అంతకుముందు రైతులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను డీపీఎం ప్రవీణ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మోడల్ మండల టీం లీడ్ చందురెడ్డి, మండల ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, ఎంటీ పద్మావతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



స్టాల్ వద్ద కూరగాయలు కొనుగోలు చేస్తున్న అధికారులు, స్థానికులు

బీఎస్ఎన్ఎల్ టీపీసీ సభ్యుడిగా బిల్లా నరేష్



రాజంపేట : అనంతపురం రీజియన్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా బిల్లా నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మినిస్ట్రీ ఆఫ్ టెలి కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ (న్యూఢిల్లీ) డైరెక్టర్ ఊర్వశి సాంగ్వాన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బీఎస్ఎన్ఎల్ టీపీసీ సభ్యుడిగా నియామకానికి సహకరించిన రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి, తనకు ఈ పదవి రావడానికి సిఫార్సు చేసిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలను తెలియజేశారు. బీఎస్ఎన్ఎల్ పరంగా వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోండి

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంత రైతులు తమ పంట పొలాలకు సంబంధించిన సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్రీధర్ రావు పేర్కొన్నారు. బుధవారం చెన్నరాజుపోడు పంచాయతీ కొర్లకుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు. 870/67/ఎన్2 భూమిలో రాస్తా వివాదం నెలకొనడంతో సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇరు వర్గాల వారితో మాట్లాడి సర్వే రికార్డుల్లో రాస్తా లేకపోయినా రైతును ఒప్పించే ప్రయత్నం చేశారు. రైతులందరూ సామరస్యంగా మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్ఐ రామ్మోహన్ నాయుడు, వీఆర్‌ఓ ఎల్లయ్య, కానిస్టేబుల్ వలీ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వేదపండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వ్రతం పాల్గొన్న వారికి గెలివి మల్లికార్జున శెట్టి, నిర్మల దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, గెలివి కుమార్, మేడా వెంకట కుమార్, గెలివి శివశంకర్‌లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

సిద్దవటం : మండలంలోని వెలుగుపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య నెలకొనడంతో బుధవారం ఎస్సీ కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మా గ్రామానికి కూతవేటు దూరంలో పెన్నానది ఉందని నది నుంచి తమకు తాగునీరందక 15 రోజులు కావొస్తోందన్నారు. కాలనీలో 110 కుటుంబాలు ఉన్నాయని, కుళాయిలకు తాగునీరు రాకపోవడంతో గ్రామంలోని చేతి పంపులో నీరు తాగుతున్నామన్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులను గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి జానకిని వివరణ కోరగా పెన్నానదిలో



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి పైప్ డ్యామేజ్ కావడం వల్ల గ్రామలో నీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. పైపు కింద భాగంలో రంధ్రం పడి ఉండటంతో, ఆప్రాంతంలో చుట్టూ నీరు ఉండటంతో మరమ్మతుకు ఆటంకంగా మారిందన్నారు. రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

డార్విన్ సిద్ధాంతాన్ని తిరిగి పాఠ్యాంశాల్లో చేర్చాలి

సిద్దవటం : విద్యార్థులపై సిలబస్ భారాన్ని తగ్గించే పేరిట 9, 10 తరగతుల్లోని డార్విన్ జీవ పరిణామ క్రమ సిద్ధాంతాన్ని తొలగించడం అత్యంత దురదృష్టకరమని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్ బాషా పేర్కొన్నారు. సిద్దవటం మండలంలోని 11వ బెటాలియన్, సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక రూపొందించిన డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సమీర్‌బాషా మాట్లాడుతూ డార్విన్ సిద్ధాంతం జీవుల పరిణామం, నూతన జీవుల ఆవిర్భావం, జన్యు శాస్త్రం మొదలైన వాటికి ఆయువుపట్టు అని తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయుడు రవిశంకర్ మాట్లాడుతూ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం జీవుల నిర్మాణంలో, ప్రవర్తనలో, జన్యువులో కాలక్రమేణ సంభవించే మార్పులను వివరించే శాస్త్రీయ సిద్ధాంతమని చెప్పారు. ఇటువంటి ముఖ్యమైన అంశాలను తప్పకుండా మరలా పాఠ్యాంశాలలో చేర్చాలని, దాని వల్ల విద్యార్థులకు ఉపయోగకరమని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వకృత్వ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమ్మ, పరమేశ్వరి, మౌలాలి, హేమంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు గుర్తింపు కార్డు పొందాలి

రామాపురం : భూమి కలిగి ఉన్న ప్రతి రైతు ఆయా గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని యూనిక్(విశిష్ట గుర్తింపు కార్డు) కార్డు పొందాలని మండల వ్యవసాయ అధికారిణి వై.నాగమణి బుధవారం తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సేవలు అమోఘం

రాజంపేట రూరల్ : గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రజల కోసం చేస్తున్న సేవలు అమోఘమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని అయ్యపురాజుపల్లె, చెర్లోపల్లి, ఎర్రబల్లి గ్రామాలలో బుధవారం ఎమ్మెల్యే ఆకేపాటి పర్యటించారు. ముందుగా పౌర్ణమిని పురస్కరించుకొని ఆకేపాటి ఎస్టేట్‌లో ఉన్న దేవాలయాల సముదాయంలోని వేంకటేశ్వరస్వామి, సాయిబాబా, శివయ్యలకు పూజలు చేశారు. అనంతరం మండల పరిధిలోని అయ్యపురాజుపల్లి గ్రామంలో నిర్వహించిన జానకీరామరాజు దశదినకర్మలలో పాల్గొని నివాళులర్పించారు. చెర్లోపల్లి గ్రామంలో మృతి చెందిన నరసింహరాజు తల్లికి నివాళులర్పించారు. ఎర్రబల్లిలో మృతి చెందిన సుబ్బరాజు మృతదేహానికి నివాళి అర్పించారు. ఈ పర్యటనలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ఎమ్మెల్యే ఆకేపాటి దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా ప్రజలకు తాము ఏ విధంగా సేవలు అందిస్తున్నారో వివరించారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ వైస్ చైర్మెన్ మర్రి రవికుమార్, మాజీ మండల కన్వీనర్ డి.భాస్కర్‌రాజు, నాయకులు ఎ.సౌమిత్రి, ఎ.చెంచురెడ్డి, కె.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఆకేపాటి

నివాళి

పుల్లంపేట : మండలంలోని అనంతయ్యగారిపల్లి వైఎస్సార్‌సీపీ మాజీ జెడ్పీటీసీ సిదౌద్ వెంకటసుబ్బమ్మ భర్త సిద్దా రాజశేఖర్ రెడ్డి దశదిన కర్మకు రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కుమార్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం సిద్దా రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తదుపరి ఆయన సేవలను కొనియాడారు. పార్టీ తరపున ఎల్లవేళలా అండగా ఉంటామని మృతుని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


ఘనంగా మాతంగి మహర్షి, సంత్ రవిదాస్ జయంతి వేడుకలు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి అలయం వద్ద కొలువైన యాభై అడుగుల జాంభవంతుని భారీ విగ్రహం వద్ద మాతంగి మహర్షి, సంత్ రవిదాస్ జయంతి వేడుకలను ఆది జాంభవంత ధర్మ రక్షణ సమితి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జయంతి వేడుకలకు రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ సభను నిర్వహించగా, మాతంగి పీఠం మహా పీఠాధిపతులు నూకల రవీంద్ర స్వామి చేతులమీదుగా జయంతి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాంభవంతుని విగ్రహం వద్ద మాతంగి మహర్షి, సంత్ రవిదాస్ చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు మహా కుంభమేళా నుంచి తీసుకువచ్చిన త్రివేణి సంగమం జలాలను భక్తులపై చల్లారు.



మాతంగి మహర్షి, సంత్ రవిదాస్ చిత్రపటాలకు పూజలు చేస్తున్న భక్తులు

రైతులకు యూనిక్ కార్డు తప్పనిసరి



చిట్వేలి: మైలపల్లెలో చేస్తున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ



సంబేపల్లె: మాట్లాడుతున్న డీఏఓ చంద్రానాయక్

సంబేపల్లె : రైతులకు యూనిక్ కార్డు (విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డు) తప్పనిసరి అని వ్యవసాయశాఖ డీఏఓ చంద్రానాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లె రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు 11 నెంబర్ల కలిగిన యూనిక్ కార్డులను తప్పనిసరిగా పొందాలన్నారు. అనంతరం ఆ కార్డు వలన రైతులకు అందే పథకాలను వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ వెంకటమోహన్, మండల ఏఓ కిషోర్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

చిట్వేలి : ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ప్రతిరైతు నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. బుధవారం మైలపల్లెలో యూనిక్ కార్డు రిజిస్ట్రేషన్‌ను సిబ్బంది చేశారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందని అధికారులు తెలియజేశారు. రైతులు వారి ఆధార్, ఫోన్ నెంబర్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని గ్రామంలో రైతు సేవా సిబ్బందిని కలసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు.

ఏపీఎండీసీ పాఠశాల స్వీపర్ల తొలగింపు అన్యాయం

రాయచోటి అర్బన్ : మంగంపేటలోని ఏపీఎండీసీ స్కూల్‌లో పని చేసే స్వీపర్ల తొలగింపు అక్రమం, అన్యాయమని రాయచోటి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు బి.వి.రమణ, చెన్నయ్య, రాంబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు పేర్కొన్నారు. ఏపీఎండీసీ పాఠశాలలో స్వీపర్ల తొలగింపును నిరసిస్తూ బుధవారం పట్టణంలోని పాత రాయచోటి సచివాలయం ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ ఏపీఎండీసీ యాజమాన్యం గత 3 సంవత్సరాలుగా పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికురాళ్లను అకారణంగా తొలగించడం తగదన్నారు. కాంట్రాక్టర్‌నంటూ చెప్పుకుంటున్న మహేష్ కార్మికులకు 3 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. టెండర్ వేయకుండా కాంట్రాక్టర్‌గా చలామణి అవుతున్న మహేష్‌కు కూటమి నేతలు మద్దతునిస్తుండడం కుట్రపూరితమని పేర్కొన్నారు. పిల్లల మలమూత్రాలు శుభ్రం చేస్తూ జీవితాలను నెట్టుకొస్తున్న కార్మికుల కడుపుకొట్టడం కూటమి నేతలకు తగదన్నారు. పైగా న్యాయం కోసం గత 17 రోజులుగా శాంతియుతంగా రిలే దీక్షలను చేపడుతున్న కార్మికులను మహిళలని కూడా చూడకుండా పోలీసులతో అరెస్టు చేయించడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం పతనం ఏపీఎండీసీ స్వీపర్ల తొలగింపుతో నాందికానున్నట్లు చెప్పారు. స్వీపర్లకు అండగా ఉంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



రాయచోటి అర్బన్: పాతరాయచోటి సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్మికుల అరెస్టు దుర్మార్గం

రాజంపేట రూరల్ : విధుల నుంచి తొలగించారని రిలే దీక్షలు చేస్తున్న ఏపీఎండీసీ స్కూల్‌లో పనిచేసిన కార్మికులను అరెస్టు చేయటం దుర్మార్గమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పంది కాళ్ల మణిలు మండిపడ్డారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓబులవారిపల్లి మండలం మంగంపేటలోని ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్‌లో హౌస్ కీపింగ్, స్కావెంజర్స్‌గా పనిచేస్తున్న కార్మికులు మూడు నెలలుగా తమకు అందాల్సిన జీతాలు చెల్లించాలని కోరితే వారిని విధుల నుంచి తొలగించడం ఏమిటని నిలదీశారు. దీనిని నిరసిస్తూ గత 16 రోజుల నుంచి శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వారితో చర్చించాల్సిన ఏపీఎండీసీ యాజమాన్యం, ప్రభుత్వం విస్మరించడమే కాక మహిళలని చూడకుండా అరెస్టు చేయించడాన్ని ఖండించారు. వారిని బకాయిలు చెల్లించడమే కాక విధుల్లోకి తీసుకోకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



రాజంపేట రూరల్: మాట్లాడుతున్న సీపీఎం నేతలు